




Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక






శనివారం 22-08-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :65 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## గోల్కొండలో రహస్య సొరంగం!



2 లో

400 ఏళ్ల సమాధుల వద్ద తవ్వకాలు

తవ్వకాల్లో బయటపడ్డ సొరంగం

గోల్కొండలో మళ్లీ రహస్య కలకలం

ఎవరు తవ్వారు? ఎందుకు తవ్వారు?

పురావస్తుశాఖకు ఎమ్మెల్యే సమాచారం

గోల్కొండ-చార్మినార్ సొరంగమా?

## కాంగ్రెస్‌లో కల్లోలం!

సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫైర్

మంత్రి పదవి నుంచి తొలగించాలి

పార్టీ నుంచి డిస్మిస్ చేయాలి

కూతురి వ్యాఖ్యలను ఖండించరా?

సీఎంకు వెంటనే క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్‌లో ఉంటూ కుట్రలా?



**న్యూస్ డెస్క్, 21 ఆగస్టు (ఇది కద నిజం):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ ఆమె కుమార్తె కొండా సుస్మిత వివాదం తీవ్రరూపం దాల్చింది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీని లక్ష్యంగా చేసుకుని సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శాసనసభాపక్ష వేదికగా 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అత్యవసర ప్రెస్ మీట్ నిర్వహించారు. కొండా సురేఖను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు, పార్టీ నుండి కూడా డిస్మిస్ చేయాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

**కూతురు మాట్లాడితే తల్లికి సంబంధం ఉండదా: బీర్ల ఐలయ్య**

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తరపున ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. "కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను మంత్రి సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని మేమంతా తీవ్రంగా తప్పుబడుతున్నాం. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదనడం అత్యంత విడ్డూరం. పార్టీలో ఏవైనా అభిప్రాయభేదాలు ఉంటే సీఎల్పీ లేదా పీసీసీ సమావేశాల్లో మాట్లాడాలి తప్ప, ముఖ్యమంత్రిని, పార్టీని ఉద్దేశించి బహిరంగంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఏమాత్రం సరికాదు" అని స్పష్టం చేశారు.

2 లో

## హస్తం పార్టీలో ఆధిపత్య పోరు!

కాంగ్రెస్ కలహాలతో బీఆర్ఎస్‌కు బలం

రేవంత్ తీరుపై నారాయణ కీలక వ్యాఖ్యలు

22ఏ భూములపై నారాయణ సంచలన ఆరోపణలు

కాంగ్రెస్‌ను మా సూచనలు పట్టించుకోవడం లేదు

పార్టీలో నేతల మధ్య పెరుగుతున్న విభేదాలు

కాంగ్రెస్ అంతర్గత పోరుపై నారాయణ ఫైర్

## స్థానిక ఎన్నికల కోసం జనసేన కమిటీ

స్థానిక ఎన్నికలపై జనసేన ఫోకస్

14 మందితో ప్రత్యేక కమిటీ

కమిటీలో బాలినేనికి నో ఛాన్స్!

బాలినేని పేరు లేకపోవడంపై చర్చ

ఎన్నికల వ్యూహంపై పవన్ కసరత్తు

బలమైన స్థానాలపై నివేదిక ఇవ్వండి

స్థానిక పోరుకు జనసేన రెడీ



2 లో

## స్కూళ్ల అక్రమాలపై డిజిటల్ కొరడా!

ప్రైవేట్ స్కూళ్లకు ఇక చుక్కలే

ఇంట్లో నుంచే ఫిర్యాదు చేసే అవకాశం

ఓటీపీతో సులభంగా లాగిన్ సదుపాయం

ఆధారాలతో ఫిర్యాదు చేసే వెసులుబాటు

అధికారుల పర్యవేక్షణలో ఫిర్యాదుల పరిష్కారం

అక్రమాలపై విద్యాశాఖ కఠిన చర్యలు

2 లో

## యూపీఎస్సీ అభ్యర్థులకు అలర్ట్!

ప్రశ్నాపత్రాలపై అభ్యంతరాలకు ప్రత్యేక పోర్టల్

ఆగస్టు 31న పోర్టల్ ప్రారంభం

సెప్టెంబర్ 4 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఆఫ్‌లైన్ విజ్ఞప్తులు స్వీకరించరు

పోర్టల్ ద్వారానే అభ్యంతరాలు నమోదు

మెయిన్స్ పరీక్షలపై యూపీఎస్సీ ప్రకటన

2 లో

## కారు డిక్కీలో డెడ్‌బాడీ



2 లో

● కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం ● రెండు రోజులుగా రోడ్డుపైనే కారు ● దుర్వాసనతో బయటపడిన దారుణం ● క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి ● అద్దె కారుతో హత్య చేసినట్లు అనుమానం ● నిందితుల కోసం పోలీసుల వేట

## ఇక అన్నీ బయటపెడతా : కొండా సురేఖ



2 లో

ఇప్పుడేమీ మాట్లాడను

పూర్తి వివరాలతో మీడియా ముందుకు

సీఎం వచ్చాకే స్పందిస్తా: సుస్మిత

వ్యాఖ్యలపై సుస్మిత క్లారిటీ

రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

తెరపైకి రానున్న అసలు విషయాలు



## జెన్‌జీ టార్గెట్.. కేంద్రం మాస్టర్ ప్లాన్!

**న్యూస్ డెస్క్, 21 ఆగస్టు (ఇది కద నిజం):** దేశంలోని జెన్‌జీ యువతను తమ వైపు ఆకట్టుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో నేరుగా సంభాషించేందుకు, వారి సమస్యలను వినేందుకు, దేశాభివృద్ధిపై వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ భారీ యువజన అనుసంధాన కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. 'వన్ డే, వన్ యూనివర్సిటీ (ఒక రోజు, ఒక విశ్వవిద్యాలయం)' పేరుతో తలపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఒక కేంద్ర మంత్రి ఒక విశ్వవిద్యాలయాన్ని సందర్శించేలా ప్రణాళికలు రూపొందించారు. ఢిల్లీ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై విద్యార్థుల నిరసనలు, ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో ఈ సరికొత్త కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలుస్తోంది.

మిగతాది 2 లో..

- జెన్‌జీపై కేంద్రం ఫోకస్
- రోజుకో వర్సిటీలో మంత్రి
- విద్యార్థులతో నేరుగా ముచ్చట్లు
- యువత సమస్యలపై ఆరా
- మంత్రులకు వర్సిటీలు కేటాయింపు
- నీట్ నిరసనల వేళ కొత్త ప్లాన్
- గాంధీ జయంతి నుంచే కోచింగ్?
- పేదలకు ఫ్రీ డిజిటల్ కోచింగ్
- నీట్.. జేఈఈకి జాతీయ వేదిక

## రాజస్థాన్‌లో షాకింగ్ ఘటన

జేపీ కార్యకర్తలకు చేదు అనుభవం

గ్రామస్థుల చేతిలో తరిమివేత!

పాఠశాల తనిఖీకి వెళ్లగా నిరసన

గ్రామం ముందు బారికేడ్లు

సీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు

గేదెల కొట్టంలో తరగతులు!

స్కూల్ దుస్థితిపై గ్రామస్థుల ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 21 ఆగస్టు (ఇది కద నిజం):** దేశవ్యాప్తంగా ప్రతి గ్రామానికి తిరుగుతూ.. 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లాలో చేదు అనుభవం ఎదురైంది. బగ్రూ నియోజకవర్గం పరిధిలోని రాంపూరా కన్వార్‌పురా గ్రామంలోని ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించేందుకు వచ్చిన సీజేపీ బృందానికి గ్రామస్థుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. తమ 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంలో భాగంగా పాఠశాల తనిఖీకి వచ్చిన సీజేపీ కార్యకర్తలను స్థానికులు వెంటపడి పెరిగెత్తించారు.

2 లో

## బీజేపీది దిగజారుడు రాజకీయం

అర్వింద్‌కు మైండ్ పనిచేయడం లేదు!

రేవంత్ జోలికి వస్తే తాట తీస్తాం

సీఎం పర్యటనపై రచ్చ ఎందుకు?

అర్వింద్‌కు ఆది శ్రీనివాస్ వార్నింగ్

తెలంగాణలో మీ ఆటలు సాగవు

కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చే కుట్రలు!



2 లో

**న్యూస్ డెస్క్, 21 ఆగస్టు (ఇది కద నిజం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనపై బీజేపీ నాయకులు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అనవసర రచ్చ చేస్తూ దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులకు మెదడు పనిచేయడం లేదని, ముఖ్యమంత్రి పర్యటనను కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఆది శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ..

# కాంగ్రెస్‌లో కల్లోలం!

మొదటి పేజీ తరువాయి

**చెట్టు మీద ఉండి ఆ కొమ్మనే నరుకుతున్నారు: వేముల వీరేశం**

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. కొండా సురేఖ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సీఎం రేవంత్ రెడ్డిపై ఎవరు తప్పుడు ఆరోపణలు చేసినా అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవాలి. పార్టీలోనే ఉంటూ సీఎం నిర్ణయాలను తప్పుబట్టడం అంటే, ఉన్న చెట్టు కొమ్మను తామే నరుక్కున్నట్లే. ఈ తల్లీకూతుళ్ల వ్యాఖ్యలను ఖండించకపోతే ప్రతిపక్షాలకు బలం చేకూర్చినట్లవుతుంది. గతంలో కూడా కొండా సురేఖ నోరుజారి పార్టీకి తలవంపులు తెచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. సీఎంకు కొండా కుటుంబం వెంటనే క్షమాపణ చెప్పాలి. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి, పార్టీ నుంచి డిస్మిస్ చేయాల్సిందే" అని డిమాండ్ చేశారు.

విపక్షాల కుట్రలను అమలు చేస్తున్నారు: బాలు నాయక్

దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. "సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం. విపక్షాల కుట్రలను కొండా కుటుంబం కాంగ్రెస్‌లో ఉంటూ అమలు చేస్తోంది. తెలంగాణలో ప్రజాపాలన సాగుతుంటే, కొండా సురేఖ మాత్రం ప్రతిపక్ష నేతలా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రిని వ్యతిరేకించే వారికి కాంగ్రెస్ పార్టీలో కొనసాగే అర్హత ఎంతమాత్రం లేదు. పార్టీ అధిష్ఠానం సురేఖపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి" అని స్పష్టం చేశారు.

పార్టీకి ఇచ్చే గౌరవం ఇదా..: నాయిని రాజేందర్ రెడ్డి

జిల్లాలో ఏ ఒక్క ఎమ్మెల్యేతోనైనా కొండా సురేఖ సఖ్యతగా లేదని నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. ఆమె నాలుగు పార్టీలు తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని ఫైర్ అయ్యారు. మంత్రి పదవులు ఇస్తే.. పార్టీకి, సీఎంకు ఇచ్చే గౌరవం ఇదా అని ప్రశ్నించారు. కొండా సురేఖ వెను బీఆర్ఎస్, బీజేపీలు ఉన్నారని కామెంట్ చేశారు. పార్టీలో నేటికీ కొన్ని గుంట నక్కలు ఉన్నాయని.. దమ్ముంటే 200 కోట్ల స్కామ్ ఏంటో బయటపెట్టాలని సవాల్ విసిరారు.

# రాజస్థాన్‌లో షాకింగ్ ఘటన

మొదటి పేజీ తరువాయి

**గ్రామం ముందు బారికేడ్లు.. నిరసన**

సీజేపీ టీమ్ రాక కంటే ముందే స్థానిక ప్రజలు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి, లోపలికి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. సీజేపీ నాయకులు రాగానే వారి మధ్య, గ్రామస్థుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సీజేపీ కార్యకర్తలను గ్రామం నుంచి బయటకు పంపేసినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత గ్రామస్థులు పాఠశాల బయట ధర్నా చేపట్టి సీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే, ఈ ఘటనపై బగ్రూ డీఎస్పీ ధర్మేంద్ర శర్మ స్పందిస్తూ.. తమకు ఆ ఘటనపై ఎలాంటి ముందస్తు సమాచారం లేదా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

**గేదెల కొట్టంలో పాఠశాల..**

సదరు ప్రభుత్వ పాఠశాల భవనం ప్రమాదకరంగా మారడంతో దానిని మూసివేశారని, ప్రస్తుతం తరగతులను పక్కనే ఉన్న ఒక గేదెల కొట్టంలో నిర్వహిస్తున్నారని సమాచారం. బీజేపీ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపిన గ్రామస్థులు మాట్లాడుతూ.. ఈ భవనాన్ని బాగుచేసే సామర్థ్యం స్థానికులకు ఉందని, ప్రభుత్వం కూడా ఇప్పటికే ఈ పనుల కోసం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇటీవల సీజేపీ బృందాలు ప్రభుత్వ పాఠశాలల్లో జరిపిన తనిఖీల నేపథ్యంలో, పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు, మీడియా ప్రవేశించకుండా రాజస్థాన్ విద్యాశాఖ ఆంక్షలు విధించినట్లుగా తెలుస్తోంది. అయితే, ఆ ఆంక్షలపై సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ ర్యాంకా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని బయటపడకుండా దాచేందుకే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నియంతృత్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. తాము ప్రభుత్వ ఆజ్ఞలకు భయపడేది లేదని.. రాజస్థాన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు మెరుగుపడే వరకు మా 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# బీజేపీది దిగజారుడు రాజకీయం

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వ అధికారిక అనుమతులతోనే బ్రిటన్ పర్యటనకు వెళ్లారని స్పష్టం చేశారు. లండన్‌లోని ప్రముఖ విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలను సందర్శించి అక్కడి ప్రమాణాలను పరిశీలిస్తే బీజేపీ నాయకులకు ఎందుకు కడుపునొప్పి అని ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ తెలిసి కూడా ఎంపీ ధర్మపురి అర్వింద్ అతితెలివి ప్రదర్శిస్తూ, "భారత వ్యతిరేక శక్తులను కలవడానికే సీఎం వెళ్లారు" అని పిచ్చి కూతలు కూస్తున్నారని నిప్పులు చెరిగారు. 2014లో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రధాని నరేంద్ర మోడీ 103 విదేశీ పర్యటనలు చేసి 82 దేశాలు తిరిగారని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. "ప్రధాని ఎందుకోసం వెళ్లారు? ఆయన కూడా పనిలేక తిరుగుతున్నారా?" అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన మూడేళ్ల కాలంలో కేవలం రెండు సార్లు దావోస్‌కు, ఒకసారి అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలకు మాత్రమే వెళ్లారని, రాష్ట్ర అభివృద్ధి కోసం వెళ్తే బీజేపీ నాయకులు ఏడవడం వారి మానసిక వైకల్యానికి నిదర్శనమని విమర్శించారు.

తెలంగాణలో మీ ఆటలు సాగవు..

"ఏ విధంగానైనా ఈసారి తెలంగాణలో అధికారంలోకి వస్తాం" అని ధర్మపురి అర్వింద్ మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, అక్రమ మార్గాల్లో అధికారంలోకి రావడం తమకు అలవాటే అని అర్వింద్ నిర్లజ్జగా ఒప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. "అర్వింద్ గుర్తు పెట్టుకో.. తెలంగాణలో మీ ఆటలు సాగవు. ఇక్కడుంది రేవంత్ రెడ్డి. మా ప్రభుత్వం జోలికి వస్తే తోకలు కత్తిరించి పంపిస్తాం.. తాట తీస్తాం" అని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్రలు చేస్తున్నాయని, గతంలో ఇలాగే ప్రయత్నించి బీఆర్ఎస్ ఘోరంగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాల్సిన ఎంపీలు బెదిరింపులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. "ఏ విధంగానైనా అధికారంలోకి వస్తాం" అన్న అర్వింద్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వెంటనే జవాబు చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# హస్తం పార్టీలో ఆధిపత్య పోరు!



**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న పరిస్థితులపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు నడుస్తోందని అన్నారు. కాంగ్రెస్ నేతల అంతర్గత కలహాల వల్ల రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ పుంజుకుంటోందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ఏ తప్పూ చేయకుండా ఉంటేనే మంత్రులు, కిందిస్థాయి అధికారుల్లో భయం ఉంటుందని చెప్పారు. 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదని, ఎన్నికలలో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని చెప్పారు. అంతే కాకుండా తమ సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

ఇదిలా ఉంటే కాంగ్రెస్ లో పలువురు నేతల మధ్య విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇటీవల పరకాల ఎమ్మెల్యే టికెట్ తనదే అంటూ కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో పార్టీలో కుదుపులు మొదలయ్యాయి. అంతేకాకుండా ఆమె సీఎం రేవంత్ పైనే నేరుగా అవినీతి ఆరోపణలు, విమర్శలు చేశారు. మరోవైపు తుంగతుర్తిలో రాజగోపాల్ రెడ్డి, మందుల సామేలు మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. వీటితో పాటు వనపర్తి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్సెస్ కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి మధ్య వార్ నడుస్తోంది.

# యూపీఎస్సీ అభ్యర్థులకు అలర్ట్!




**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు-2026కు హాజరయ్యే అభ్యర్థులకు కీలక ప్రకటన చేసింది. పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నాపత్రాలకు సంబంధించి ఎలాంటి సందేహాలు, పొరపాట్లు, అభ్యంతరాలు ఉన్నా వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అభ్యర్థులు పరీక్షలు ముగిసిన తర్వాత తమ విజ్ఞప్తులను సమర్పించడానికి అధికారిక 'క్వశ్చన్ పేపర్ రిప్రజెంటేషన్ పోర్టల్'ను ఉపయోగించుకోవచ్చని కమిషన్ తెలిపింది.

అభ్యంతరాల నమోదు వివరాలు..

ఈ ఆన్‌లైన్ పోర్టల్ ఆగస్టు 31న ఉదయం ప్రారంభమై సెప్టెంబర్ 4, 2026 వరకు అంటే మొత్తం 5 రోజుల పాటు అందుబాటులో ఉంటుంది. అభ్యర్థులు తమ సందేహాలు, అభ్యంతరాలను కేవలం అధికారిక క్వశ్చన్ పేపర్ రిప్రజెంటేషన్ పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఈమెయిల్, సాధారణ పోస్ట్, కొరియర్, ఇతర ఆఫ్‌లైన్ మార్గాల ద్వారా పంపే విజ్ఞప్తులను కమిషన్ ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించదని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తారు. అయితే, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్-2026 పరీక్షలు దేశవ్యాప్తంగా రెండు విడతల్లో జరగనున్నాయి. మొదటి విడత ఆగస్టు 21 నుంచి ఆగస్టు 23 వరకు, రెండో విడత ఆగస్టు 29 నుంచి ఆగస్టు 30, 2026 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

# కారు డిక్కీలో డెడ్‌బాడీ



**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** కారు డిక్కీలో డెడ్‌బాడీ కలకలం సృష్టించి భయానక ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకుంది. రహదారి పక్కన నిలిపి ఉంచిన ఒక కారు డిక్కీలో కుళ్లిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహం లభించడం స్థానికంగా పెద్ద ఎత్తున కలకలం సృష్టించింది.

పోలీసులు కథనం మేరకు.. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన గత రెండు రోజులుగా ఒక కారు అనుమానాస్పదంగా ఆగి ఉంది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆ కారును అక్కడే వదిలేసి వెళ్లినట్లు స్థానికులు గమనించారు. అయితే, ఉదయం ఆ కారు నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో స్థానికులకు అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎల్కతుర్తి పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కారును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారు డిక్కీ తెరచి చూడగా అందులో తీవ్రంగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఒక మహిళ మృతదేహం లభ్యమైంది. వెంటనే ఆధారాల సేకరణ కోసం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల ప్రాథమిక విచారణలో మృతురాలిని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన యువతిగా గుర్తించారు. నిందితులు ఈ కారును అద్దెకు తీసుకుని ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తేలింది. దీంతో కారు యజమాని సురేందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద నుంచి సమాచారాన్ని రాబడుతున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ, ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

# గోల్కొండలో రహస్య సొరంగం!



**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** గోల్కొండలో 400 ఏళ్ల నాటి సమాధుల వద్ద అక్రమ తవ్వకాలు జరపడం కలకలం రేపుతోంది. కుతుబ్షాహీ సమాధుల ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. క్రీడా మైదానంలో తవ్వకాల వద్ద ఓ రహస్య సొరంగం బయటపడింది. ఈ తవ్వకాలపై ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సూచనలతో కార్వాన్ ఎమ్మెల్యే పురావస్తుశాఖ అధికారులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ తవ్వకాలు ఎవరు జరిపారు? ఎందుకు జరిపారు? అనే కోణంలో విచారిస్తున్నారు. మరోవైపు క్రీడామైదానంలో బయటపడిన రహస్య సొరంగం గురించి ఆసక్తికర చర్చ నడుస్తోంది. గోల్కొండ కోట వద్ద నుండి చార్మినార్ కు ఓ రహస్య సొరంగం ఉందనే ప్రచారం ఉండేది. అయితే ఈ తవ్వకాల్లో క్రీడా మైదానం వద్ద రహస్య సొరంగం కనిపించడంతో అది చార్మినార్ వద్దకు వెళ్లే మార్గమే అనే ప్రచారం కూడా మరోసారి జోరందుకుంది.

# స్కూళ్ల అక్రమాలపై డిజిటల్ కొరడా!




**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యానికి, అధిక ఫీజుల దోపిడీకి చెక్ పెట్టేందుకు పాఠశాల విద్యాశాఖ బిగ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ప్రైవేట్ స్కూళ్లపై వచ్చే ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా 'ఆన్‌లైన్ ప్రైవేట్ స్కూల్ కంప్లైంట్ మానిటరింగ్ సిస్టమ్' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై పాఠశాలల అక్రమాలపై తల్లిదండ్రులు, విద్యార్థులు లేదా సాధారణ ప్రజలు ఎవరైనా ఇంట్లో కూర్చునే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచే లక్ష్యంతో విద్యాశాఖ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**సులభంగా ఫిర్యాదు నమోదు.. ఓటీపీతో లాగిన్**

పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లోని 'Online Services' విభాగం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఫిర్యాదు నమోదు చేయాలనుకునే వారు తమ మొబైల్ నంబర్‌తో లాగిన్ కాగా, ఆ నంబర్‌కు వచ్చే ఓటీపీ (OTP) ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలి. అనంతరం పాఠశాల పేరు, ఫిర్యాదు రకం, సమస్య పూర్తి వివరాలను తెలిపి, ఆధారాలకు సంబంధించిన పత్రాలు లేదా ఫోటోలను నేరుగా అప్‌లోడ్ చేసే సదుపాయం కల్పించారు. సమస్య తీవ్రతను బట్టి సంబంధిత విద్యాశాఖ అధికారులు తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారు.

**స్టేటస్ ట్రాకింగ్ సదుపాయం.. జవాబుదారీతనం**

తాము ఇచ్చిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు 'Grievance Tracking Mechanism'ను కూడా ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారులు తమ ఫోన్ నంబర్ లేదా కేటాయించిన 'Grievance ID' ద్వారా ప్రక్రియ పురోగతిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకోవచ్చు. ఇందులో ఫిర్యాదు ఐడీ, పేరు, ఫోన్ నంబర్, యూజర్ రకం, అప్‌లోడ్ చేసిన పత్రాలు , ఆన్-గ్రౌండ్ అధికారి తీసుకున్న చర్యల ప్రస్తుత స్థితి స్పష్టంగా కనిపిస్తుంది. ప్రైవేట్ స్కూళ్ల వేధింపులపై నిజమైన సమస్యలు ఉన్న తల్లిదండ్రులు పూర్తి, కచ్చితమైన వివరాలతో ఈ ఆన్‌లైన్ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ కోరింది.

# స్థానిక ఎన్నికల కోసం జనసేన కమిటీ



**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయమై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురువారం ముఖ్య నేతలతో చర్చించారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధి విధానాల రూపకల్పనకు 14 మందితో ప్రత్యేక కమిటీని పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధినాలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటుంది. కమిటీలో మండలి బుద్ధ ప్రసాద్, టి.శివశంకర్, కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పత్సమట్ల ధర్మరాజు, చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవికుమార్ సభ్యులుగా ఉంటారని జనసేన పార్టీ అధికారికంగా ప్రకటించింది.

అయితే 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేరు లేకపోవటంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపుబాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన జాయినింగ్స్ కమిటీ, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు, డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల రూపకల్పన కమిటీలో చోటు లేకపోవటంతో నెట్టింట చర్చ జరుగుతోంది.

మరోవైపుస్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని, ఈ ఎన్నికలలో అనుసరించే విధివిధానాల రూపకల్పనకు ప్రత్యేక కమిటీని నియమిస్తామని పవన్ కళ్యాణ్ గురువారం తెలిపారు. జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పవన్ పిలుపునిచ్చారు.

పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజక వర్గాలకే పరిమితం కాకుండా, జనసేన బలబలాలను బేరీజు వేసి, పోటీ చేసేందుకు తగిన స్థానాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. వైసీపీ పాలనను ముగించేందుకే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన 21 సీట్లకు పరిమితమై పోటీ చేసిందని. ఆ వ్యూహం ఆ ఎన్నికలకేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికలకు ఆయా ప్రాంత రాజకీయ, సామాజిక పరిస్థితులను అనుసరించి వ్యూహాలు ఉంటాయని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# ఇక అన్నీ బయటపెడతా: కొండా సురేఖ

**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాల వేళ మంత్రి కొండా సురేఖ నివాసంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మీడియాలో నడుస్తున్న వివాదాస్పద అంశాలపై స్పందించిన మంత్రి, త్వరలోనే అన్నీ విషయాలను వివరంగా మాట్లాడతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. "మా ఇంట్లో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమంలో నేను బిజీగా ఉన్నాను. ఇప్పటికే చెప్పాల్సిన విషయాలన్నీ నిన్ననే స్పష్టంగా మాట్లాడాను. ప్రస్తుతం ఇంకా అదనంగా చెప్పడానికి ఏమీ లేదు. త్వరలోనే పూర్తి వివరాలతో అన్ని నేష విషయాలనూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడతాను" అని వ్యాఖ్యానించారు.

**సీఎం వచ్చాకే స్పందిస్తా: సుస్మితా పటేల్**

అనంతరం మంత్రి కుమార్తె కొండా సుస్మితా పటేల్ మాట్లాడుతూ.. తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాల గురించి మాట్లాడతాను. అప్పటి వరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయను. త్వరలోనే నేను కూడా అన్ని వివరాలనూ తప్పకుండా మాట్లాడతాను" అని మీడియా ప్రతినిధులకు తెలిపారు. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రి సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# జెన్‌జీ టార్గెట్.. కేంద్రం మాస్టర్ ప్లాన్!

మొదటి పేజీ తరువాయి

విద్యాశాఖ, యువజన శాఖ మంత్రుల సమన్వయంతో..

యువతతో అనుసంధానం అయ్యే ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించడానికి, విశ్వవిద్యాలయాలు, పాల్గొనే కేంద్ర మంత్రులను సమన్వయం చేసే బాధ్యతలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, యువజన సంక్షేమ, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయలకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ కార్యక్రమం కింద మంత్రులకు నిర్దిష్ట విశ్వవిద్యాలయాలను కేటాయించనున్నారు. అక్కడ వారు విద్యార్థులతో సమావేశమై వివిధ అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, యువత, విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారు. కాగా.. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ యువజన అనుసంధాన ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు.

గాంధీ జయంతి నుంచి ఆన్‌లైన్ కోచింగ్ ?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమాన్ని అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నుండి అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ అంశంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశమై చర్చించారు. ఇందులోనే 'వన్ డే, వన్ యూనివర్సిటీ' కార్యక్రమంపై కూడా చర్చ జరిగింది. ఈ సమావేశం అనంతరం ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులతో ప్రహ్లాద్ జోషి సమీక్ష నిర్వహించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు నాణ్యమైన పాఠ్యాంశాలు, నిపుణుల మార్గదర్శకత్వం, క్రమబద్ధమైన శిక్షణను అందుబాటులోకి తెచ్చేలా ఒక సమర్థవంతమైన జాతీయ డిజిటల్ వేదికను సిద్ధం చేస్తున్నట్లు ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు పేద, మధ్యతరగతి కుటుంబాలపై మోపుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ జాతీయ ప్లాట్‌ఫారమ్‌ను తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది.

# హైదరాబాద్‌లో ఎకరం రూ.264 కోట్లు

**న్యూస్ డెస్క్, 21 ఆగష్టు (ఇది కద నిజం):** రాష్ట్ర రాజధానిలోని రియల్ ఎస్టేట్ రంగానికి కేంద్రబిందువుగా ఉన్న ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మునుపెన్నడూ లేని రీతిలో ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా తెలంగాణ పారిశ్రామిక ప్రాథమిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన ఈ వేలంలో ఐటీ కారిడార్ రాయదుర్గంలో ఒక ఎకరం భూమి ఏకంగా రూ. 264 కోట్లకు అమ్ముడుపోయి సంచలనం సృష్టించింది. రాయదుర్గం సర్వే నంబర్ 83/1 లోని పాన్‌మక్తాలో పరిధిలో ఉన్న 5.25 ఎకరాల స్థలానికి టీజీఐఐసీ ఇటీవల నిర్వహించిన ఈ వేలంలో ఎకరం ధర రూ.264 కోట్లకు అమ్ముడుపోయి భారత రియల్ ఎస్టేట్ చరిత్రలోనే రికార్డు నమోదు చేసింది.

గత రికార్డు వేలాలు..

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్, నాలెడ్జ్ సిటీ, కోకాపేట ప్రాంతాల్లో గడిచిన కొన్నేళ్లుగా ప్రభుత్వ వేలాల్లో భూముల ధరలు నిరంతరం రికార్డులను తిరగరాస్తున్నాయి. ఇదే సర్వే నంబర్ 83/1లో గత మే 2026లో టీజీఐఐసీ నిర్వహించిన 6.29 ఎకరాల భూమి ఈ వేలంలో ఎకరం రూ. 237 కోట్లు పలికి అప్పటివరకు దేశంలోనే అత్యధిక రికార్డుగా నిలిచింది. దీంతో పాటు అదే సర్వే నంబర్‌లో జూన్ 2026న మరో 5.09 ఎకరాల ప్లాట్ వేలంలో ఎకరం రూ. 204 కోట్లకు అమ్ముడుపోయింది. అంతకుముందు అక్టోబర్ 2025న రాయదుర్గంలోనే నిర్వహించిన ఓ వేలంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికింది. ఇలా తరచూగా ధరలు ఆకాశాన్ని అంటి రికార్డులు క్రియేట్ చేస్తున్నాయి.

పెరుగుతున్న ధరలకు కారణం..

రాయదుర్గం ప్రాంతం మైండ్ స్పేస్, నాలెడ్జ్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్టకు అత్యంత సమీపంలో ఉండటం. కీలకమైన వ్యాపార కారిడార్లలో పెద్ద విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలు చాలా తక్కువగా అందుబాటులో ఉండటం. బిల్డింగ్ ఎత్తులపై ఉన్న సడలింపులతో బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాలు నిర్మించేందుకు భారీ సంస్థలు ముందుకు రావడం వంటివి ధరల పెరుగుదలకు కారణం అవుతున్నాయి. మరోవైపు రాయదుర్గంలో వరుసగా జరుగుతున్న వేలాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున ఆదాయం సమకూరుతోంది.

# లైంగిక వేధింపుల చట్టం పోష్ పై అవగాహన...




నల్లగొండ (ఇది కద నిజం): ఆఫీసులు, ఆసుపత్రులు మరియు ఇతర పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొనే వేధింపులను అరికట్టడానికి లైంగిక వేధింపుల నివారణ చట్టం (POSH Act) చట్టం ఒక బలమైన కవచంలా పనిచేస్తుందని మహిళా సాధికారత కేంద్రం సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ చైతన్య అన్నారు.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం (District Hub for Empowerment of Women) వారి ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళలపై పై ఒక ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ... పని ప్రదేశాలలో మహిళల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,మహిళలకు సురక్షితమైన, భయరహిత వాతావరణం కల్పించడం యాజమాన్యాల ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. 2013 పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల (నిషేధం మరియు నివారణ) చట్టం యొక్క ముఖ్య ఉద్దేశాలను, అందులోని నిబంధనలను ఆమె మహిళలకు వివరించారు.. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో తప్పనిసరిగా 'అంతర్గత కమిటీ' (Internal Committee - IC) ని ఏర్పాటు చేయాలని, వేధింపులకు గురైన మహిళలు ఎలాంటి భయం లేకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేసుకునేలా భరోసా కల్పించాలని అన్నారు.. . మహిళల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ చర్యలను, చట్టపరమైన రక్షణలపై ఉద్యోగినులకు అవగాహన కల్పించారు.

# ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం వేగవంతం చేయాలి.. కలెక్టర్..



నల్లగొండ (ఇది కద నిజం): నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు జిల్లాలోని 8 ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ నిధులు విడుదలైనందున, ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ భూసేకరణకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో మాట్లాడి పరిష్కరించాలని చెప్పారు.. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం 2,800 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని అన్నారు.

# కోనలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి అభిషేకం, స్వామివారి తిరుప్పావడ సేవ



నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం):– నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శుక్రవారం శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారు, శ్రీ పెంచల నరసింహస్వామి వార్లకు ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఉదయం 5:00 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం జరిపారు. అనంతరం ఉదయం 9:00 గంటలకు ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి అన్నకూటోత్సవం (తిరుప్పావడ సేవ) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పెంచలకోనలో వైభవంగా శ్రావణ రెండవ శుక్రవారం పూజలు



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):– రాపూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా స్వామివారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5:00 గంటలకు వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, కన్నులపండువగా పుష్పాలంకరణ జరిపారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవా ఉత్సవం, సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి లోటుపాట్లు, అసౌకర్యాలు కలగకుండా ఉపకమిషనర్ ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు



# ప్రజా పంపిణీలో విప్లవాత్మక మార్పులు..

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి...

నల్లగొండ (ఇది కద నిజం): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు మరియు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిన్న సాయంత్రం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్ తో కలిసి ఆయన పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బంది పడ్డారని, తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పౌరసరఫరాల శాఖను ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని దాదాపు 80 నుండి 90 శాతం మంది ప్రజలు తినలేకపోయేవారని అందుకే సన్న బియ్యం పథకం తెచ్చామనీ, . దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 42 లక్షల మంది పేదలు లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు.. ప్రస్తుతం రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే 15 రోజుల్లో సూర్యాపేట జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికీ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.

# వివేకా హత్య కేసును మరోసారి తెరపైకి తేవడం

## డైవర్షన్ రాజకీయాల్లో భాగమే.!

- త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసమే ఈడీ సోదాలపై హడావుడి.
- వైయస్ఆర్సీపీ పార్టీ కడప మాజీ మేయర్ పాక సురేష్ కుమార్



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 21:

రాష్ట్రంలో ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న పలు సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఉన్న సమయంలో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య కేసును మరోసారి తెరపైకి తీసుకొస్తున్నారని కడప మాజీ మేయర్ పాక సురేష్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలను ఏదో గొప్ప విజయం సాధించినట్లుగా కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించి, రాజకీయంగా లబ్ధి పొందేందుకు వివేకా హత్య కేసును మరోసారి రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకునే ప్రయత్నం జరుగుతోందని, కడప పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో భాగంగా పాకా సురేష్ కుమార్ మాట్లాడుతూ..

ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై వస్తున్న ఆరోపణలు, స్పోర్ట్స్ కోటాలో అవకతవకలపై వస్తున్న విమర్శలు, పోలీసుల కారులో గంజాయి పట్టుబడిన ఘటన, సుగాలి ప్రీతి తల్లి న్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని అడ్డుకున్న ఘటన, అధికార పార్టీకి చెందిన ఎంపీ కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాద ఘటన వంటి అంశాలపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోందని పాక సురేష్ అన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉండగా, వాటిపై చర్చ జరగకుండా మరో అంశాన్ని ముందుకు తీసుకురావడం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని ఆయన విమర్శించారు.

వివేకా హత్య కేసులో నిజాలు బయటకు రావాలి.

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు, వైఎస్సార్ కుటుంబానికి సన్నిహితుడైన వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఘటనపై పూర్తిస్థాయిలో నిజాలు వెలుగులోకి రావాలని పాక సురేష్ అన్నారు. ఈ కేసుపై ఇప్పటికే వివిధ దర్యాప్తు సంస్థలు విచారణ జరిపాయని, కేసు న్యాయస్థానాల పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. కాబట్టి రాజకీయ ఆరోపణలు, మీడియా ప్రచారాల కంటే కోర్టులో ట్రయల్ సజావుగా జరిగి వాస్తవాలు ప్రజల ముందుకు రావడమే ముఖ్యమని అన్నారు. వివేకానందరెడ్డి హత్యకు అసలు బాధ్యులు ఎవరు? హత్య వెనుక ఉన్న కుట్ర ఏమిటి? అనే విషయాలు న్యాయపరమైన విచారణ ద్వారా తేలాలని ఆయన స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల ముందు రాజకీయ డ్రామాలు వద్దు.

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలను ప్రభావితం చేసే విధంగా పాత కేసులను రాజకీయంగా తెరపైకి తీసుకురావడం సరికాదని పాక సురేష్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ సమస్యలు, అభివృద్ధి, పాలన ఆధారంగా తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, కానీ ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయ డ్రామాలతో వారిని తప్పుదోవ పట్టించలేరని ఆయన అన్నారు. కడప నగరంతో పాటు రాష్ట్రంలోని స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులు, తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, ప్రజలకు అందాల్సిన మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి.

ఎంత ప్రచారం చేసినా వాస్తవాలను ప్రజల నుంచి శాశ్వతంగా దాచలేరని పాక సురేష్ అన్నారు. తప్పుడు ప్రచారాలు, రాజకీయ ఆరోపణలు కాకుండా ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. వివేకా హత్య కేసుతో పాటు సుగాలి ప్రీతి కేసు వంటి సున్నితమైన అంశాల్లోనూ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడం, పారదర్శక పాలన అందించడం ప్రభుత్వ బాధ్యత అని పాక సురేష్ స్పష్టం చేశారు.

# మోరగుడి లో ఇంటింటికి తెలుగుదేశం.. రెండు సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 21:

జమ్మలమడుగు మండలం, మొరగుడి గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమం పేరుతో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహణలో కడపజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించాడు. ఈ కార్యక్రమంలో భూపేష్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సంక్షేమాలను ఇంటింటికి తిరుగుతూ వివరించడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళలాగా పరిగెత్తిస్తున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్నీ చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల, ఎన్నికలలో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్ లు, చేనేతలకు ఉచిత విద్యుత్ ఆర్థిక సాయం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, ఆటో డ్రైవర్ల సేవలో, మత్స్యకారుల సేవలో, శ్రీ శక్తి పథకం, ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలో సోలార్, విండ్ పవర్, దాల్మియా రెండవ సిమెంట్ పరిశ్రమ, జె ఎస్ డబ్ల్యూ ఆధ్వర్యంలో స్టీల్ పరిశ్రమ, ఇంకా రానున్న సోలార్ పవర్ ప్రాజెక్టుతో జమ్మలమడుగు నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, జమ్మలమడుగు నియోజకవర్గ ముఖ చిత్రాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు, రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి లోకేష్ ముందున్నారని ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి భూపేష్ రెడ్డి తెలిపారు. ఇకపోతే జమ్మలమడుగు వైఎస్ఆర్సిపి నాయకులు డీఎస్సీ పైన లేని రాద్ధాంతం చేస్తున్నారని, నాలుగు రోజుల క్రితం జరిగిన శీతాకాల అసెంబ్లీ సమావేశాలలో విద్యాశాఖ మంత్రి లోకేష్ చాలా స్పష్టతతో కూడుకున్న సమాచారాన్ని రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి తెలిపారని, వైఎస్ఆర్సిపి నాయకులు డీఎస్సీ పైన బూటకపు మాటలు మాట్లాడుతున్నారే తప్ప అందులో వాస్తవికత లేదు అని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోరగుడి, జమ్మలమడుగు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కడపలో సింగపూర్ టౌన్‌షిప్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ ముగింపు




ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 21:

కడపలోని 450 నివాస గృహాలతో కూడిన సింగపూర్ ఎస్టిఎం టౌన్‌షిప్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సొసైటీ చట్టం1995 ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. సొసైటీ నమోదు అనంతరం 300 మందికి పైగా కాలనీవాసులు సభ్యులుగా చేరగా, ప్రధాన నిర్వాహకులు నియమించిన ఎన్నికల పరిశీలకులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిగాయి. ఆగస్టు 20 న సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం 15 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకులు ప్రకటించారు. అధ్యక్షుడిగా మాజీ మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. టి.ఎస్. రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రిమ్స్ నోడల్ అధికారి జి. రవి కుమార్, కోశాధికారిగా హోలిస్టిక్ హాస్పిటల్స్ జనరల్ సర్జన్ డా. ఎల్. వెంకటేశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా సహకార అధికారికి పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డా. టి.ఎస్. రెడ్డి మాట్లాడుతూ.. అత్యధిక విద్యావంతులైన సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం ఎస్ టి ఎం టౌన్‌షిప్ అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా, వ్యవస్థీకృతంగా ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ముఖ్యంగా మెరుగైన శుభ్రత, పారిశుద్ధ్యం, స్థిరమైన నీటి సరఫరా, పటిష్టమైన భద్రతా చర్యలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

అదేవిధంగా, తాత్కాలిక కమిటీ వెంటనే నివాసుల నుంచి నిర్వహణ రుసుము వసూలు చేయడం నిలిపివేసి, సంబంధిత రికార్డులు, బాధ్యతలను నూతనంగా ఎన్నికైన కమిటీకి అప్పగించాలని ఆయన కోరారు. కొత్త కమిటీ పారదర్శకమైన, ప్రజాస్వామ్య పద్ధతిలో సింగపూర్ టౌన్‌షిప్ పరిపాలనను ముందుకు తీసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.




# డైరెక్ట్ ఓటీటీలో 'గాంధారి'!




లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు, విభిన్నమైన యాక్షన్ రోల్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన బాలీవుడ్ భామ తాప్సీ పన్ను మరో పవర్‌ఫుల్ రోల్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గాంధారి'. దేవాశిష్ మఖిజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ చిత్రాన్ని ప్రముఖ రచయిత్రి కనికా థిల్లాన్ తన కథా పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. 'జాయ్‌పుర్రా' అనే ఒక కల్పిత నగరం నేపథ్యంలో సాగే ఈ కథలో తాప్సీ 'బానీ' అనే శక్తివంతమైన తల్లి పాత్రను పోషించారు. తన బిడ్డకు ఎదురయ్యే ఊహించని సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో ఆ తల్లి చూపే ధైర్యం, ఆరాటం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో ఇష్వాక్ సింగ్, ఛాయా కదమ్, స్వస్తిక ముఖర్జీ, మీతా వశిష్ఠ్, జతిన్ సర్నా కీలక పాత్రల్లో నటించి కథకు మరింత బలాన్ని చేకూర్చారు.

షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డైరెక్ట్ ఓటీటీలోకి రాబోతుంది. తాజాగా, ఈ విషయాన్ని ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా ప్రసారానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాగా, గతంలో వచ్చిన 'ఫిర్ ఆయీ హసీన్ దిల్రుబా' విజయం తర్వాత నెట్‌ఫ్లిక్స్, కనికా థిల్లాన్, తాప్సీ కాంబినేషన్‌లో వస్తున్న మరొక క్రేజీ ప్రాజెక్ట్ ఇది. ఈ సందర్భంగా కనికా థిల్లాన్ మాట్లాడుతూ.. "పరిస్థితులకు లొంగిపోని ఒక ధైర్యవంతమైన మహిళ కథే గాంధారి. బానీ ప్రయాణం చాలా ఉద్వేగభరితంగా ఉంటుంది. తాప్సీ ఈ పాత్రలో ఒదిగిపోయి నటించింది" అని తెలిపారు. అలాగే నెట్‌ఫ్లిక్స్ ఇండియా ప్రతినిధి రుచికా కపూర్ షేక్ స్పందిస్తూ, ఇది తల్లి ప్రేమను ఒక గొప్ప శక్తిగా చూపించే పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్ అని ప్రశంసించారు.

# షావుకారు జానకి కన్నుమూత!



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలనాటి ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (95) కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు చెన్నై లోని కావేరి ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె ఆరోగ్యం మరింత విషమించడంతో ఐసీయూలో చికిత్స అందజేస్తుండగా షావుకారు జానకి తదిశ్వాస విడిచారు. అయితే, ఆమె మరణ వార్తను తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియాలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు.

జానకి నేపథ్యం ఇలా..

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 1931 డిసెంబరు 12న శంకరమంచి జానకి జన్మించారు. ఆమె తండ్రి టి.వెంకోజీరావు పేపర్ పరిశ్రమ నిపుణుడు కాగా, తల్లి శచీదేవి గృహిణి. చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్న జానకి, తన 11వ ఏటనే రేడియో నాటికల ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టారు. ఆమెకు 15 ఏళ్లకు వివాహమైనప్పటికీ, నటన పట్ల ఉన్న అభిరుచితో రంగస్థల నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు.

'షావుకారు' చిత్రంతో వెండితెరకు పరిచయం..

విజయా ప్రొడక్షన్స్ నిర్మించిన 'షావుకారు' (1950) చిత్రం ద్వారా జానకి చలనచిత్ర రంగానికి పరిచయమయ్యారు. ఆ సినిమా అనూహ్య విజయం సాధించడమే కాకుండా, ఆమె నటించిన పాత్రకు విశేష ప్రజాదరణ లభించడంతో 'షావుకారు జానకి'గా చిత్రసీమలో స్థిరపడిపోయారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కలిపి మొత్తం 380కి పైగా చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి అగ్ర కథానాయకుల సరసన సుమారు రెండు వందలకు పైగా సినిమాల్లో ఆమె కథానాయికగా అలరించారు. 'రోజులు మారాయి', 'మంచి మనసులు', 'డాక్టర్ చక్రవర్తి' వంటి అగ్ర చిత్రాలు ఆమె నటనా పటిమకు నిదర్శనంగా నిలిచాయి. ఇక ఆమె సోదరి కృష్ణకుమారి కూడా సినీ రంగంలో ప్రముఖ నటిగా గుర్తింపు పొందారు. కళారంగానికి ఆమె అందించిన విశేష సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2022లో ఆమెను ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. వీటితో పాటు అరిజోనా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆమె, జాతీయ ఫిల్మ్ అవార్డులు, తెలుగు సినిమా అవార్డుల కమిటీల్లో జ్యూరీ సభ్యురాలిగా కూడా సేవలు అందించారు.

# 'డిసి'తో లోకేష్ మాస్ రాంపేజ్

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్లలో ఒకరైన లోకేష్ కనగరాజ్ 'డిసి' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు. ఈ సినిమాలో వామికా గబ్బి కీలక పాత్రలో కనిపించగా, అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మించారు. మంచి అంచనాల నడుమ ఆగస్టు 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. ఇప్పటివరకు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రాబట్టిన కలెక్షన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

తమిళనాడు ప్రాంతంలో రూ.21.30 కోట్లు, తెలుగు రాష్ట్రాల్లో రూ.9.25 కోట్లు, కర్ణాటకలో రూ.8.40 కోట్లు, కేరళలో రూ.17.95 కోట్లు, రెస్ట్ ఆఫ్ ఇండియాలో రూ.3.45 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.22.35 కోట్ల కలెక్షన్లను వసూలు చేసింది. మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా రూ.42.70 కోట్ల షేర్, రూ.92.70 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది. ఈ సినిమాకు రూ.19 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ జరగగా, రూ.20 కోట్ల టార్గెట్‌తో బరిలోకి దిగింది. దాంతో ఈ మూవీ ఇప్పటికే రూ.22.70 కోట్ల లాభాలను అందుకుని డబుల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇలా లోకేష్ కనగరాజ్ దర్శకుడిగా మాత్రమే కాకుండా హీరోగా కూడా అద్భుతమైన విజయాన్ని అందుకున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# 'హాయ్' ట్రైలర్ విడుదల!

లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది.

ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది.

ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. సెన్సార్ బోర్డ్ నుంచి 'యు/ఎ' సర్టిఫికెట్ తెచ్చుకున్న ఈ చిత్రం, ఆగస్టు 28న ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.




# 'మిరపకాయ్' రీ-రిలీజ్

మాస్ మహారాజా రవితేజ కెరీర్‌లో మంచి విజయాన్ని సాధించిన చిత్రాల్లో 'మిరపకాయ్' ఒకటి. రిచా గంగోపాధ్యాయ, దీక్షా సేత్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహించారు. ఎల్లో ఫ్లవర్స్ బ్యానర్‌పై రమేష్ పుప్పాల నిర్మించిన ఈ సినిమాకు థమన్ సంగీతం అందించారు. నాగబాబు, ప్రకాష్ రాజ్, సునీల్, అలీ, బ్రహ్మాజీ తదితరులు ఇందులో ముఖ్య పాత్రలు పోషించారు. ఈ మూవీ 2011 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదలై అప్పట్లో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమాను రీ-రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సెప్టెంబర్ 18న ఈ చిత్రాన్ని భారీ ఎత్తున రీ-రిలీజ్ చేయనున్నట్లు ప్రకటిస్తూ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇటీవల టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర పలు చిత్రాలు రీ-రిలీజ్ అయి మంచి ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. మరి రవితేజ కెరీర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'మిరపకాయ్' రీ-రిలీజ్‌లో ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తుందో చూడాలి.

